తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | మంగళవారం - 07- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 33 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# పర్యాటక ప్రాజెక్టులకు వేగం పెంచండి

**ఎకో టూరిజంపై సీఎం దృష్టి**
**పర్యాటక కేంద్రాల అభివృద్ధి**
**పెట్టుబడులపై ప్రత్యేక కసరత్తు**
**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పర్యాటక శాఖ పనితీరును సమీక్షించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా పరిధిలోని అటవీ భూములను వినియోగించి ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సూచించారు. సమావేశంలో సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగర పరిసర ప్రాంతాల్లో కొత్త ఎకో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రకృతి పరిరక్షణతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు.
హైదరాబాద్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. తారామతి బారాదరి, దుర్గం చెరువును ఆధునిక పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మంజీరా, దిల్‌కుషా అతిథి గృహాలను ఆధునీకీకరించాలని ఆదేశించారు.

మిగతా 2లో






# హైదరాబాద్ విమానాశ్రయంలో కొత్త యూడీఎఫ్ ప్రతిపాదన

**వచ్చే ప్రయాణికులపైనా యూజర్ డెవలప్‌మెంట్ ఫీజు**
**ఏఈఆర్ఏ ఆమోదం తర్వాతే అమలు**
**విమానాశ్రయ విస్తరణకు రూ.13,975 కోట్ల ప్రణాళిక**

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణించే వారితో పాటు, ఇకపై హైదరాబాద్‌కు విమానంలో చేరుకునే ప్రయాణికులపైనా యూజర్ డెవలప్‌మెంట్ ఫీజు (యూడీఎఫ్) విధించేందుకు రంగం సిద్ధమైంది. విమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఈ మేరకు ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఈఆర్ఏ)కు ప్రతిపాదనలు సమర్పించింది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు ఏఈఆర్ఏ పరిశీలనలో ఉన్నాయి. ప్రస్తుతం యూడీఎఫ్‌ను కేవలం బయలుదేరే ప్రయాణికుల నుంచే వసూలు చేస్తున్నారు. అయితే కొత్త ప్రతిపాదన ప్రకారం, బయలుదేరే ప్రయాణికులతో పాటు హైదరాబాద్‌కు వచ్చే ప్రయాణికుల నుంచీ కూడా ఈ రుసుము వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో డిపార్చర్, అరైవల్ ప్రయాణికుల మధ్య యూడీఎఫ్‌ను విభజించే విధానాన్ని అమలు చేయాలని జీఎంఆర్ ప్రతిపాదించింది.
కొత్త ప్రతిపాదన ప్రకారం దేశీయ ప్రయాణికులకు

మిగతా 2లో

# ములుగు అభివృద్ధి పనులకు వేగం

- **సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు**
- **మేడారం మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక దృష్టి**
- **యూరియా సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి**
- **మంత్రి సీతక్క**

ములుగు, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు): జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేడారం ఆలయ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, ఐడీఓసీ పనుల పురోగతి, రామచంద్రపురం భూసర్వే, పైలాన్ నిర్మాణం, వర్షాల పరిస్థితి, ముఖ్యమంత్రి పర్యటనకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

మిగతా 2లో





# ఎల్కతుర్తి అభివృద్ధికి మరో అడుగు

- **రూ.13 కోట్లతో బీటీ రహదారి పనులకు మంత్రి పొన్నం శంకుస్థాపన**
- **గ్రామాల అనుసంధానంతో రాకపోకలు మరింత సులభం**
- **జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

హనుమకొండ, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎల్కతుర్తి జంక్షన్ నుంచి మడిపల్లి వరకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణం పూర్తయితే గ్రామాలకు మండల కేంద్రంతో మెరుగైన అనుసంధానం ఏర్పడి

మిగతా 2లో

# హమాలీల సమస్యలు పరిష్కరించడం మా బాధ్యత: కేటీఆర్



రెండేళ్లలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా
రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ
హమాలీల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉంటుందని హామీ

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు): హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్‌లో జరిగిన 18వ హమాలీ యూనియన్ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన హమాలీ కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, హమాలీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హమాలీల కూలీ రేట్లను గణనీయంగా పెంచినట్లు గుర్తు చేశారు.

మిగతా 2లో

# ట్రాన్స్‌ప్లాంట్ సేవలకు టిమ్స్ సిద్ధం

- **అవయవ మార్పిడి కేంద్రంగా అభివృద్ధి**
- **అత్యాధునిక సదుపాయాల పరిశీలన**
- **ప్రభుత్వ వైద్య సేవల విస్తరణకు చర్యలు**
- **రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పర్యాటక ప్రాజెక్టులకు వేగం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)




నగర వారసత్వ సంపదను పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేయాలని సూచించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యంగా వికారాబాద్‌లోని శ్రీ వీరభద్రస్వామి దేవాలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసి, దేవస్థానానికి ప్రత్యేక పాలక మండలిని ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ ప్రాంతంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీయూఆర్ పరిధిలో అర్బన్ ఫారెస్ట్ నమూనాలో ఎకో టూరిజం ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని సీఎం పేర్కొన్నారు. అలాగే పురానాపూల్ వంటి చారిత్రక వంతెనలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. అవసరమైతే ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల్లో మళ్లించి పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వచ్చే డిసెంబరులో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించాలని, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ఉన్నతస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.




## హైదరాబాద్ విమానాశ్రయంలో కొత్త యూడీఎఫ్ ప్రతిపాదన

(మొదటి పేజీ తరువాయి)

బయలుదేరే సమయంలో రూ.580, చేరుకునే సమయంలో రూ.170 యూడీఎఫ్‌గా వసూలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రయాణికులకు బయలుదేరేటప్పుడు రూ.1,150, చేరుకునే సమయంలో రూ.350 వసూలు చేయాలని ప్రతిపాదించారు. అయితే ఈ ఛార్జీలు వెంటనే అమల్లోకి రావని, ఏఈఆర్‌ఏ ఆమోదం లభించిన తర్వాత మాత్రమే అమలు చేస్తామని అధికారులు తెలిపారు. ఏఈఆర్‌ఏ ఆమోదం లభిస్తే 2026 సెప్టెంబర్ 1 నుంచి జారీ చేసే విమాన టికెట్లకు మాత్రమే ఈ కొత్త యూడీఎఫ్ వర్తించనుంది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులపై ఈ ప్రభావం ఉండదని విమానాశ్రయ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రయాణికులపై ఒక్కసారిగా అదనపు భారం పడకుండా దశలవారీగా అమలు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం.

విమానాశ్రయంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రాబోయే మూడేళ్లలో సుమారు రూ.13,975 కోట్ల వ్యయంతో భారీ విస్తరణ పనులు చేపట్టాలని జీఎంఆర్ ప్రణాళిక రూపొందించింది. ఇందులో కొత్త ప్రయాణికుల టెర్మినల్ నిర్మాణంతో పాటు అదనపు రన్‌వే, ఇతర ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన నిధుల సమీకరణలో భాగంగానే యూడీఎఫ్ విధానాన్ని కొనసాగించడం అవసరమని సంస్థ తన ప్రతిపాదనలో పేర్కొంది. విమానాశ్రయ విస్తరణ పూర్తై ఆదాయం పెరిగిన తర్వాత 2030-31 నాటికి యూడీఎఫ్ ఛార్జీలను తగ్గించే అవకాశాన్ని కూడా జీఎంఆర్ సూచించింది. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలపై ఏఈఆర్‌ఏ ప్రజాభిప్రాయాలను స్వీకరించి తుది నిర్ణయం తీసుకోనుంది. నిర్ణయం వెలువడిన తర్వాత కొత్త యూడీఎఫ్ విధానంపై అధికారిక ప్రకటన జారీ కానుంది.





# ట్రాన్స్‌ప్లాంట్ సేవలకు టిమ్స్ సిద్ధం

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు): సనత్‌నగర్‌లోని తెలంగాణ వైద్య విజ్ఞాన సంస్థ (టిమ్స్)ను అన్ని రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు చెందిన ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లతో కలిసి టిమ్స్ ఆస్పత్రిని సందర్శించి అత్యాధునిక వైద్య సదుపాయాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ప్రీఆపరేటివ్, పోస్ట్‌ఆపరేటివ్ వార్డులు, ఐసీయూలు, ఇతర వైద్య సదుపాయాలను పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమావేశమై ట్రాన్స్‌ప్లాంట్ సేవల విస్తరణపై చర్చించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

సనత్‌నగర్ టిమ్స్‌ను అన్ని రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించే అత్యుత్తమ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ సేవలను మరింత విస్తరించేందుకు అవసరమైన సూచనలు చేయాలని వైద్యులను కోరారు. ప్రభుత్వం అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. టిమ్స్‌లో ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్సలకు అవసరమైన ఆధునిక ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూలు, వైద్య పరికరాలు సిద్ధంగా ఉన్నాయని ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు తెలిపారు. దశలవారీగా కిడ్నీ, కాలేయం, గుండె తదితర అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ప్రారంభించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని వెల్లడించారు.

నిమ్స్‌లో పరిమిత ఆపరేషన్ థియేటర్ల కారణంగా శస్త్రచికిత్సల కోసం రోగులు ఎక్కువకాలం వేచి ఉండాల్సి వస్తోందని వైద్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి, నిమ్స్‌లో పెండింగ్‌లో ఉన్న న్యూరో సర్జరీలు, కిడ్నీ మార్పిడి, గుండె శస్త్రచికిత్సలు వంటి క్లిష్ట ఆపరేషన్లను టిమ్స్‌లో నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌ను నిమ్స్ తరహాలో స్వయంప్రతిపత్తి కలిగిన వైద్య సంస్థగా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. టిమ్స్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే నిమ్స్, గాంధీ, ఉస్మానియా వంటి ప్రభుత్వ ఆస్పత్రులపై ఒత్తిడి తగ్గడంతో పాటు ట్రాన్స్‌ప్లాంట్, ఇతర క్లిష్ట శస్త్రచికిత్సల కోసం రోగులు నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి కూడా గణనీయంగా తగ్గుతుందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.



## ఎల్కతుర్తి అభివృద్ధికి మరో అడుగు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పారు. ఈ రహదారి విద్యార్థులు, రైతులు, వ్యాపారులతో పాటు సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అభివృద్ధికి నాణ్యమైన రహదారులు కీలకమని, ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఎల్కతుర్తి మండల కేంద్రానికి కోర్టు, విద్యుత్ ఉపకేంద్రం, తహసీల్దార్ కార్యాలయం వంటి ప్రభుత్వ సంస్థలు రానున్నాయని మంత్రి తెలిపారు. దీంతో మండల కేంద్రం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు పరిపాలనా సేవలు కూడా సులభంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రహదారి నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పలుమార్లు తమ దృష్టికి తీసుకువచ్చారని మంత్రి గుర్తుచేశారు. వారి విజ్ఞప్తి మేరకే ఈ పనులను మంజూరు చేశామని తెలిపారు. పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రహదారి నిర్మాణానికి ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ రహదారి నిర్మాణంతో గ్రామాల మధ్య అనుసంధానం పెరిగి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఊతమిస్తుందని అన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ఎల్కతుర్తి-దామెర ప్రధాన రహదారిని అధికారులతో కలిసి పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్, కలెక్టర్, కుడా సీపీవో అజిత్‌రెడ్డిని మంత్రి శాలువాలతో సన్మానించారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయుడి సేవలను స్మరించుకున్నారు.

# ములుగు అభివృద్ధి పనులకు వేగం

(మొదటి పేజీ తరువాయి)




వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు యూరియా కొరత రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. ఎరువుల సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి కోసం సుమారు రూ.6 వేల కోట్ల విలువైన పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ములుగు పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, కేంద్రీయ విద్యాలయం, పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్, కరకట్టల నిర్మాణం, పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలో చేపట్టిన అన్ని ప్రధాన అభివృద్ధి పనులను ఒకే శిలాఫలకంపై పొందుపరిచి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లా అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని అభివృద్ధి పనుల పురోగతిపై వివరాలు అందించారు.

# హమాలీల సమస్యలు పరిష్కరించడం మా బాధ్యత: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

గతంలో బస్తాకు రూ.8 మాత్రమే ఉండే రేటును రూ.26కు పెంచామని, ఐదేళ్లకోసారి కాకుండా రెండేళ్లకోసారి కూలీ రేట్ల సవరణ చేపట్టి హమాలీలకు న్యాయం చేశామని అన్నారు. హమాలీలకు ఆరోగ్య భద్రతతో పాటు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రత్యేకత అని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద లక్ష క్యూసెక్కుల గోదావరి నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా ప్రభుత్వం పంపులను ప్రారంభించడం లేదని విమర్శించారు. రెండు పంపులు ప్రారంభిస్తే రాష్ట్రవ్యాప్తంగా రైతులకు సాగునీరు అందుతుందని తాము పదేపదే కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్‌ఎస్‌ను విమర్శించడంపైనే దృష్టి పెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు నీళ్లు ఇస్తే యూరియా ఇవ్వాలి, పంటలు పండితే మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సాగునీరు విడుదల చేయడం లేదని విమర్శించారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని, కానీ రైతుల ప్రయోజనాలను మాత్రం విస్మరించవద్దని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో వ్యవసాయం, పారిశ్రామిక రంగం, హమాలీ కార్మికులు, మిల్లు యజమానులు అందరూ సంతృప్తిగా ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగిందని, రైతులు అధికంగా వరి పండించడంతో హమాలీలకు కూడా ఉపాధి అవకాశాలు పెరిగాయని అన్నారు. ప్రస్తుతం కరువు పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వం వెంటనే సాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంకా రెండేళ్లలో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హమాలీ కార్మికుల ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. ఈ కష్టకాలంలో పార్టీకి అండగా నిలుస్తున్న ప్రతి కార్యకర్తను, ప్రతి కార్మికుడిని కాపాడుకుంటామని పేర్కొంటూ, హమాలీలు ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
మంగళవారం - 07 - జూలై 2026


# డా. బాబూ జగ్జీవన్ రామ్‌కు పూలమాలతో నివాళి



• సుహాసిని మనోజ్ రావు ఘన నివాళి

**హుజురాబాద్, జూలై 6(తెలంగాణ ముచ్చట్లు ):** భారత మాజీ ఉప ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ సాధనకు జీవితాంతం కృషి చేసిన మహానేత డా. బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా హుజురాబాద్‌లో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు డా. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా సుహాసిని మనోజ్ రావు మాట్లాడుతూ, డా. బాబూ జగ్జీవన్ రామ్ భారత రాజకీయాల్లోనే కాకుండా సామాజిక న్యాయ సాధనలోనూ చెరగని ముద్ర వేసిన మహానేత అని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతి, సమాన అవకాశాల కల్పన, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడిచి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల సేవలను గుర్తు చేసుకోవడం ద్వారా సమాజంలో సేవాభావం, సామాజిక చైతన్యం మరింత పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. డా. బాబూ జగ్జీవన్ రామ్ వంటి మహనీయుల సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో డా. బాబూ జగ్జీవన్ రామ్ కమిటీ సభ్యులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందరూ కలిసి డా. బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, ఆయన దేశానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.

# లచ్చయ్య దొర మాతృవియోగం.. నివాళులర్పించిన తాటి, మెచ్చా



**దమ్మపేట, జూలై 6 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండలం మందలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు అడపా లచ్చయ్య దొర మాతృమూర్తి అడపా పుష్పావతి మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు కూడా పార్థివదేహానికి నివాళులర్పించి, లచ్చయ్య దొర కుటుంబ సభ్యులను ఓదార్చారు. పుష్పావతి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవరపల్లి అజయ్ కుమార్, మద్దెల పుల్లారావు, వెలుగోటి మహేష్, కొల్లి శేఖర్, దండాబత్తుల కాంతారావు, నాగరాజు, నడిపల్లి పోలయ్య, చెన్నారావు, సుబ్బారావు తదితరులు పాల్గొని పుష్పావతికి ఘనంగా నివాళులర్పించారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా



• డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,జూలై06(తెలంగాణ ముచ్చట్లు):** పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించడంలో సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) కీలక పాత్ర పోషిస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 110 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.38,84,200 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నిరుపేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించడంలో సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగపడుతోందన్నారు.ఈ పథకం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా ప్రజల పట్ల ప్రభుత్వ బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రతి పేద కుటుంబం సంతోషంగా జీవించే తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, కోళ్ల వెంకటేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో మారుమోగిన చేల్పూర్.. ద్వార ప్రతిష్ఠాపన



• ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి

**హుజురాబాద్, జూలై 6(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం చేల్పూర్ గ్రామంలోని చారిత్రక, అతి పురాతన శ్రీ శివాలయంలో పునః ప్రతిష్ఠా మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన ద్వార ప్రతిష్ఠాపన కార్యక్రమం వేదఘోషలు, శివనామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని పరమేశ్వరుని ఆశీస్సులు పొందారు.

గ్రామ ప్రధాన పురోహితుడు ఉదయమర్రి కృష్ణమూర్తి శర్మ, వేదపండితులు బస్మాంగి శంకరయ్య, బస్మాంగి సాత్విక్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ద్వార ప్రతిష్ఠాపన నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, హోమాలు, ప్రత్యేక పూజల మధ్య జరిగిన ఈ వేడుక ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక కాంతితో నింపింది. భక్తులు "హర హర మహాదేవ" నినాదాలతో ఆలయాన్ని మారుమోగించారు.

ఈ సందర్భంగా గ్రామ ప్రధాన పురోహితుడు ఉదయమర్రి కృష్ణమూర్తి శర్మ మాట్లాడుతూ, ఆలయ అంతరాలయం, గర్భగుడి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, మరో 15 రోజుల్లో వాటిని పూర్తి చేసి తదుపరి పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఈ శివాలయం పునర్నిర్మాణం ప్రతి భక్తుడి సహకారంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేందుకు గ్రామ ప్రజలతో పాటు మండల ప్రజలు, శివభక్తులు, దాతలు ఉదారంగా ఆర్థిక సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఆలయం భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక వారసత్వంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ తమ వంతు చేయూత అందించాలని కోరారు.

ద్వార ప్రతిష్ఠాపన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేసి ఆశీర్వచనాలు అందజేశారు. స్వామివారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు ప్రత్యేక అర్చనలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, శివభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చేల్పూర్‌లో జరిగిన ఈ ద్వార ప్రతిష్ఠాపన మహోత్సవం గ్రామ చరిత్రలో మరో చిరస్మరణీయ ఘట్టంగా నిలవడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# 5వ వార్డులో ప్రజలకు ఓటరు నమోదు, సవరణలపై విస్తృత అవగాహన



**హుజురాబాద్, జూలై 6(తెలంగాణ ముచ్చట్లు ):** ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించే లక్ష్యంతో చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ పట్టణంలోని 5వ వార్డులో సోమవారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ నాయకత్వంలో జరిగింది.

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన నాయకులు, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడంతో పాటు వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకోవాలని సూచించారు. సర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన పత్రాలను సంబంధిత అధికారులకు అందించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

5వ వార్డు కౌన్సిలర్ సొల్లు సునీత మాట్లాడుతూ, వార్డులోని ప్రతి ఇంటికి చేరుకుని ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎవరూ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని చెప్పారు. ప్రజలు కూడా సహకరించి తమ వివరాలను ధృవీకరించుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సర్ నిర్వహకులు మచ్చకట్ల రవి కార్యక్రమం ఉద్దేశాలను వివరించారు. ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకోవడం, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్, బీఎల్‌వో పాక అరుణ, 5వ వార్డు అధికారి రెంటాల మొగిలి, బీఎల్ఏ చౌడమల్ల అనిత, రిసోర్స్ పర్సన్ గాదం భాగ్యలక్ష్మి పాల్గొని ఓటర్లకు నమోదు, సవరణల విధానం, అవసరమైన పత్రాలు, దరఖాస్తు ప్రక్రియపై పూర్తి వివరాలను తెలియజేశారు. ప్రజల సందేహాలకు సమాధానాలు ఇస్తూ, ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

అలాగే 5వ వార్డుకు చెందిన ఓటర్లు, రజకవాడ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సొల్లు బాబు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సర్ కార్యక్రమంపై ఆసక్తి చూపడం విశేషంగా నిలిచింది. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, సరైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని నిర్వాహకులు తెలిపారు.

# శ్రమదానంతో కెనాల్ వాకింగ్ ట్రాక్‌కు కొత్త రూపు



• వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సేవాభావం

**హుజురాబాద్, జూలై 6(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలోని సైదాపూర్ రోడ్డులో ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ వాకింగ్ ట్రాక్‌ను పరిశుభ్రంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు కెనాల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం స్వచ్ఛందంగా శ్రమదానం చేపట్టారు. గత కొంతకాలంగా ట్రాక్‌పై ముళ్లపొదలు పెరగడం, చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వాలడం, అక్కడక్కడ గుంతలు ఏర్పడటంతో వాకింగ్‌కు వచ్చే వారు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్వయంగా పనిముట్లు తీసుకుని ట్రాక్‌ను శుభ్రపరిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముళ్లపొదలను తొలగించి, చెట్ల కొమ్మలను కత్తిరించి, గుంతలను మొరంతో పూడ్చి రాకపోకలకు అనువుగా మార్చారు. ట్రాక్ పరిసరాలను పూర్తిగా శుభ్రం చేసి వాకింగ్‌కు అనుకూల వాతావరణాన్ని కల్పించారు. వాకింగ్ ట్రాక్ అనేది కేవలం వ్యాయామం చేసే ప్రదేశమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎంతోమంది ప్రతిరోజూ వినియోగించే ప్రదేశమని సభ్యులు పేర్కొన్నారు. అలాంటి ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు తెలిపారు. ప్రజల సహకారంతో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పరిసరాలు మరింత అందంగా మారుతాయని అన్నారు. అలాగే ఈ మార్గాన్ని స్థానికులు, వాహనదారులు కూడా వినియోగిస్తున్నందున రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా శ్రమదానం చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ట్రాక్ పరిశుభ్రత కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ శ్రమదాన కార్యక్రమంలో కెనాల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని సేవాభావాన్ని చాటుకున్నారు. వారి సేవలను స్థానికులు అభినందించారు.

# అనాథ మహిళ మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు



• గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం.

**దమ్మపేట, జూలై 6 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండలం జమేదారు బంజర సమీప అటవీ ప్రాంతంలో ఈ నెల 1న మృతి చెందిన గుర్తుతెలియని అనాథ మహిళ మృతదేహానికి సోమవారం గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక పోలీసులు మూడు రోజుల క్రితం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతురాలి బంధువులు ఎవరూ గుర్తింపునకు గానీ, స్వాధీనం చేసుకోవడానికి గానీ ముందుకు రాకపోవడంతో ఆమెను అనాథగా గుర్తించారు. దీంతో పోలీసులు మందలపల్లికి చెందిన గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ సహాయాన్ని కోరగా, సంస్థ నిర్వాహకులు వెంటనే స్పందించి మందలపల్లి పంచాయతీ కార్యదర్శి, పోలీసుల సమక్షంలో కుళ్లిపోయిన మృతదేహానికి హిందూ సంప్రదాయాల ప్రకారం గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. అనాథలకు సైతం చివరి వీడ్కోలు అందిస్తూ మానవత్వాన్ని చాటిన గౌతమ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు పాలడుగుల అబ్బులు, ఎస్.కే. అజీమ్, రొయ్యల కుమార్, జేసీబీ సోము తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్‌లో వనపర్తి యువకుడికి ఉద్యోగం



**వనపర్తి,జూలై06(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణానికి చెందిన యువ ఇంజనీర్ వరుణ్ తేజ్‌కు భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ఉద్యోగం లభించింది.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. ఇటీవల ఇంజినీరింగ్ పూర్తి చేసిన వరుణ్ తేజ్ ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం సాధించడం జిల్లాకు గర్వకారణమని అన్నారు. ఏడాది శిక్షణ అనంతరం దేశంలో లేదా విదేశాల్లో పోస్టింగ్ పొందే అవకాశం ఉందని తెలిపారు.వరుణ్ తేజ్ తల్లిదండ్రులు వెంకటయ్య, సుమిత్ర ప్రభుత్వ ఉద్యోగులని పేర్కొన్నారు. సోమవారం టీచర్స్ కాలనీలోని ఆయన నివాసంలో సాహితీ కళా వేదిక ప్రతినిధులు వరుణ్ తేజ్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, కంటే నిరంజనయ్య, గంధం నాగరాజు, పి. శ్రీనివాసులు, సురేందర్, నాగన్న తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రతిభకు పట్టం కట్టిన ఏరిస్ అగ్రో.!



- **విశ్వశాంతి విద్యార్థినికి అకాడమిక్ ఎక్సలెన్స్ స్కాలర్‌షిప్.**
- **హైదరాబాద్‌లో ఘనంగా అవార్డు ప్రదానం.**

**సత్తుపల్లి, జూలై 6 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో ఏరిస్ అగ్రో లిమిటెడ్ సంస్థ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా అకాడమిక్ ఎక్సలెన్స్ స్కాలర్‌షిప్‌లను ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు. ఈ ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌కు సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయం 6వ తరగతి విద్యార్థిని గుండా బ్లెస్సీ కీర్తన ఎంపిక కావడం విశేషం. విద్యా రంగంలో ప్రతిభ కనబరిచినందుకు ఆమె ఈ గౌరవాన్ని అందుకుంది. కార్యక్రమంలో సంస్థ సీఎండీ రాహుల్ మిచ్చందాని, సీఈఓ బాబురావు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, ఉన్నత విద్యకు ప్రేరణ కల్పించడమే ఈ స్కాలర్‌షిప్‌ల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కాగా, బ్లెస్సీ కీర్తన తండ్రి గుండా నరసింహారావు ఏరిస్ కంపెనీలో ప్రతినిధిగా పనిచేస్తున్నారు. విద్యార్థిని సాధించిన ఈ విజయంపై విశ్వశాంతి విద్యాలయం యాజమాన్యం, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను అభినందించారు.

## ఓటరు జాబితా సవరణలో పారదర్శకత పాటించాలి



- **పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్.**

**సత్తుపల్లి, జూలై 6 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎలాంటి తప్పులు లేకుండా, పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్, ఎన్నికల అధికారి అజయ్ యాదవ్ బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) ఆదేశించారు. సోమవారం సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులోని 190వ పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమం తీరును సమీక్షించారు. ఎన్యుమరేషన్ ఫారాల నమోదుతో పాటు 2002 ఓటరు జాబితాలో ఉన్న, లేని వారి వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. అలాగే బీఎల్‌వోల వద్ద ఉన్న ఫారం6, ఫారం7, ఫారం8 దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) ఎస్ఐఆర్ కార్యక్రమానికి అందిస్తున్న సహకారంపై కూడా ఆరా తీశారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, వాటి తిరిగి స్వీకరణ ప్రక్రియను పరిశీలించిన ఆయన, అందుబాటులో లేని ఓటర్ల ఇళ్లను మరోసారి సందర్శించి వారి వివరాలను తప్పకుండా నమోదు చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత జాగ్రత్తతో విధులు నిర్వర్తించాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో బీఎల్‌వో మల్లీశ్వరి, సూపర్వైజర్ వెంగళరావు, బీఎల్ఏ మల్లెల్లి అనిల్, ఎన్నికల పరిశీలకుడు మధు పాల్గొన్నారు.





## సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఈడీ సోలోమన్ తనిఖీ

- **ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం.**
- **బ్రేక్‌డౌన్‌ల నివారణకు సాంకేతిక శిక్షణలు నిర్వహించాలి.**

**సత్తుపల్లి, జూలై 6 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సోలోమన్ సోమవారం సత్తుపల్లి ఆర్టీసీ డిపోను తనిఖీ చేసి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. డిపో నిర్వహణ, ప్రయాణికుల భద్రత, ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముందుగా డిపో గ్యారేజీలో ఉద్యోగులతో సమావేశమైన ఆయన, బస్సులు రోడ్లపైకి వెళ్లే ముందు సాంకేతికంగా పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ లోపాలు, బ్రేక్ వ్యవస్థ, ఇతర యాంత్రిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని, బ్రేక్‌డౌన్‌లు జరగకుండా నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. ఇందుకోసం అధికారులు, సాంకేతిక నిపుణులతో తరచూ టెక్నికల్ సెమినార్లు నిర్వహించాలని సూచించారు.
అనంతరం ఖమ్మం రీజినల్ మేనేజర్ సాయిరాంతో కలిసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. బస్టాండ్‌ను పరిశీలించి ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేలా డిపో మేనేజర్ గురజాల లక్ష్మీనారాయణకు పలు సూచనలు చేశారు. ఆదాయం-వ్యయంపై సమతుల్యత పాటిస్తేనే డిపోలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని ఈడీ పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమానికి సంస్థ ప్రాధాన్యం ఇస్తోందని, వారి కోసం రెస్ట్‌రూమ్‌లు, విశ్రాంతి సమయం వంటి సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులకు బస్సుల సమయాలపై స్పష్టమైన సమాచారం అందించేందుకు డ్రైవర్లు, కండక్టర్ల ద్వారా వెల్‌కమ్ గ్రీటింగ్స్‌తో పాటు అవసరమైన ప్రకటనలు చేయిస్తున్నామని చెప్పారు. అలాగే ఓపీఆర్ఎస్, 'గమ్యం' యాప్, ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ సాయిరాం, డిపో మేనేజర్ గురజాల లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సాహితీ, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

## జూనోటిక్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి: వెటర్నరీ డాక్టర్ రోజా రాణి




**భీమదేవరపల్లి, జూలై 6(తెలంగాణ ముచ్చట్లు):** జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే జూనోటిక్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల ప్రభుత్వ పశు వైద్యశాల వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ రోజా రాణి సూచించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జంతువుల ద్వారా మనుషులకు సంక్రమించే ప్రధాన వ్యాధుల్లో రేబీస్, లెప్టోస్పిరోసిస్, ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (బర్డ్ ఫ్లూ) ముఖ్యమైనవని తెలిపారు.

రేబీస్ వ్యాధి కుక్కలు, పిల్లులు వంటి జంతువులు కరిచినప్పుడు వ్యాపిస్తుందని, జ్వరం, ఆందోళన, గొంతు నొప్పి, నీటిని చూసినా భయం వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, నీటితో బాగా కడిగి సమీప ఆసుపత్రికి వెళ్లి పోస్ట్‌బైట్ యాంటీ రేబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలని సూచించారు. అలాగే పెంపుడు జంతువులకు సమయానికి యాంటీ రేబీస్ టీకాలు వేయించాలని అన్నారు.

లెప్టోస్పిరోసిస్ వ్యాధి ఎలుకల మూత్రంతో కలుషితమైన నీటి ద్వారా వ్యాపిస్తుందని, జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, చలి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు.

అలాగే ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (బర్డ్ ఫ్లూ) పక్షుల నుంచి మనుషులకు సంక్రమించే వైరల్ వ్యాధి అని, జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు.

పరిశుభ్రత పాటించడం, జంతువులకు సమయానికి టీకాలు వేయించడం, అనారోగ్యంతో ఉన్న జంతువులకు దూరంగా ఉండడం ద్వారా జూనోటిక్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని డాక్టర్ రోజా రాణి ప్రజలకు సూచించారు.





## రైతుల ప్రగతికి మరో అడుగు.. కలెక్టర్‌ను కలిసిన ఎఫ్‌పీఓ చైర్మన్

**జమ్మికుంట టౌన్ జులై 06 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట రైతు ప్రగతి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ (ఎఫ్‌పీఓ) చైర్మన్ సందం మహేందర్ పటేల్ సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓ సొసైటీ అభివృద్ధితో పాటు ప్లాంట్ ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం నుంచి అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతులకు మరింత ప్రయోజనం చేకూరేలా ప్లాంట్ ఏర్పాటుకు పరిపాలనా పరంగా అవసరమైన సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. అలాగే నాలుగు రోజుల క్రితం ఇదే అంశంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ను కలిసి ప్లాంట్ అభివృద్ధికి సహకరించాలని వినతిపత్రం అందజేసినట్లు సందం మహేందర్ పటేల్ వెల్లడించారు. రైతుల సంక్షేమం, ఎఫ్‌పీఓ బలోపేతం కోసం అవసరమైన అన్ని ప్రయత్నాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

## పేదల ఇంటి కలకు ఇసుక అడ్డంకి.. జమ్మికుంటలో బీజేపీ పోరుబాట




**జమ్మికుంట టౌన్ జులై 06 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో కొత్తగా ఇండ్లు నిర్మించుకుంటున్న పేద ప్రజలకు ఇసుకను తక్కువ ధరకు, సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. పట్టణ సమీపంలోని గాంధీ చౌక్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జమ్మికుంట పరిసర ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ఉన్నప్పటికీ స్థానిక అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇతర ప్రాంతాలు, రాష్ట్రాలకు అధిక ధరలకు ఇసుకను తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో స్థానిక పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్లపై పోలీసులు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తూ వాహనాలను సీజ్ చేస్తున్నారని, దీంతో ట్రాక్టర్ యజమానులు కూడా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్థానికులకు సరసమైన ధరకు ఇసుక అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు ఒక్క ట్రాక్టర్ ఇసుక కోసం రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని, ఇది పేదలపై అదనపు భారం అవుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కమిషన్లు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ, ఇసుక ధరలను తగ్గించి స్థానికులకు అందుబాటులోకి తీసుకురాకపోతే ఇతర ప్రాంతాలకు ఇసుక తరలింపును అడ్డుకుంటామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి...

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ఖమ్మం బ్యూరో, జూలై -06(తెలంగాణ ముచ్చట్లు ) :** ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడినదని, బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.
సోమవారం కలెక్టరేట్ లో జూన్ 30 నాటికి పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ పరిధిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెనుబల్లిలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సయ్యద్ యూసుఫ్, రెవెన్యూ శాఖలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్.వి. నారాయణమూర్తి, హౌసింగ్ శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేసిన పి. సాయిరాం రెడ్డి, పశుసంవర్ధక శాఖ పరిధిలో మధిర ఏరియా ఆసుపత్రిలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎస్. చంద్ర భగీరథి దేవి, రెవెన్యూ శాఖలో గిర్దావర్‌గా పనిచేసిన అల్లం రవికుమార్, విద్యాశాఖలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన షేక్ మదార్, ఇంటర్మీడియట్ విద్యా శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన అయూబ్ ఖాన్, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన కె. వెంకన్న, గిరిజన సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేసిన షేక్ హసన్ పాషా, ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసిన తేజావత్ పెంటయ్య, జిల్లా ఉపాధి కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ గా పనిచేసిన ఎం. సిద్దిక్ పదవీ విరమణ పొందారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగం ఒక బాధ్యతతో కూడినదని, సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో అంకితభావంతో సేవలందించిన ప్రతి ఉద్యోగి అభినందనీయుడని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రజా సేవలో నిర్విరామంగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతతో ప్రజలకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి భవిష్యత్ జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని కోరుకున్నారు.
అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలి...

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




**ఖమ్మం బ్యూరో, జూలై-06(తెలంగాణ ముచ్చట్లు ):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు/ జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాధపురం నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి వీడియో సమావేశంలో పాల్గొనగా, జిల్లా కలెక్టరేట్ నుండి మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయిందని, మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి వంటి పట్టణ ప్రాంతాల్లో పంపిణీ ఆశించిన స్థాయిలో లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారంలోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఇళ్లకు వెళ్లిన సమయంలో తాళం వేసి ఉంటే వాటిని 'అబ్సెంట్'గా నమోదు చేయాలని, అవసరమైతే తర్వాత మరోసారి సందర్శించి ఫారాలను అందజేయాలని సూచించారు. అందజేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారాన్ని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) తిరిగి సేకరించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా డిజిటలైజేషన్ ప్రక్రియను రాష్ట్ర వ్యాప్తంగా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాన్ని ఎలా పూరించాలో వివరించడంలో ఇబ్బంది పడుతున్న బీఎల్‌వోలకు సూపర్‌వైజర్లు సహకరించాలని, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌వోలు) సూపర్‌వైజర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైన చోట ఎక్స్పీరియన్స్ ఉన్న వాలంటీర్లను నియమించి బీఎల్‌వోలకు సహకారం అందించాలని తెలిపారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలపై తప్పనిసరిగా ఓటర్ల సంతకాలు ఉండేలా చూడాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పనులను మరింత వేగవంతం చేసి నిర్దేశించిన గడువుల్లోగా పూర్తి చేయాలని, అదే సమయంలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న *జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ* జిల్లాలో 99.5 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, ఇప్పటి వరకు 20.9 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. పనితీరు బలహీనంగా ఉన్న బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) గుర్తించి, వారికి సూపర్‌వైజర్లను సహాయంగా నియమించినట్లు తెలిపారు. ఓటర్లకు అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు జిల్లాలోని అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు.ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 5 శాతం చొప్పున ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ జరుగుతోందని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అవసరమైన ఓటర్లకు సంబంధిత ధృవీకరణ పత్రాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునేలా అధికారులు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు.ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## సమ్మక్క గద్దెలకు హరిత శోభ.. పండ్ల మొక్కలతో పచ్చదనానికి శ్రీకారం

**జమ్మికుంట టౌన్ జూలై 06 (తెలంగాణ ముచ్చట్లు):** వనమహోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలోని కేశవాపురం సమ్మక్క గద్దెల పరిసర ప్రాంతంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమ్మక్క గద్దెల పరిసరాల్లో ఉన్న విశాలమైన ప్రభుత్వ స్థలాలను పచ్చదనంతో నింపే లక్ష్యంతో అల్లనేరేడు, జామ తదితర పండ్ల మొక్కలను నాటుతున్నామని తెలిపారు. పండ్ల మొక్కలు పెరగడం వల్ల పక్షులు, ఇతర మూగజీవాలకు ఆహారం లభించడంతో పాటు కోతులు మానవ నివాస ప్రాంతాల్లోకి వచ్చే పరిస్థితి కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. దుబ్బ మల్లన్న ఆలయ పరిసరాలతో పాటు పట్టణంలోని ఇతర ప్రభుత్వ స్థలాల్లోనూ పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. "తల్లి జన్మనిస్తే.. మొక్కలు పునర్జన్మ ఇస్తాయి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పాతకాల మౌనిక అనిల్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, ఆర్పీ స్వరూప, అంగన్‌వాడీ టీచర్ శివభారతి, ఆశా వర్కర్ స్వప్నతో పాటు రమేష్, సతీష్, సురేష్, అంజి, కమలాకర్, అజయ్, సాయికిరణ్, నందు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

**ఖమ్మం బ్యూరో, జూలై - 06(తెలంగాణ ముచ్చట్లు ):** జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ముఖ్యమంత్రి పర్యటన కోసం అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం జగన్నాథపురం (మత్కెపల్లి) వద్ద నిర్వహించనున్న బహిరంగ సభ కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పర్యవేక్షించి, ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కోసం పకడ్బంది చర్యలపై వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జూన్ 30న భారీ బహిరంగ సభ నిర్వహించి రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ, అప్పటి భారీ వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని కలెక్టర్ గుర్తుచేశారు. ఉప ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన సమీక్షలో కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించిన తర్వాత కొత్త తేదీని నిర్ణయిస్తామని వెల్లడించినట్లు తెలిపారు. వాతావరణ శాఖ జూలై 6వ తేదీ వరకు భారీ వర్షాల సూచనలు ఇచ్చిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి పరిస్థితులను నిరంతరం పరిశీలించిందన్నారు. అయితే ఊహించినంతగా వర్షాలు నమోదు కాకపోవడంతో సభ నిర్వహించాల్సిన ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రౌండ్ పరిస్థితులను అంచనా వేస్తున్నామని అన్నారు. ప్రస్తుతం సభా ప్రాంగణం దాదాపు పూర్తిగా ఎండిపోయి కార్యక్రమం నిర్వహించేందుకు అనుకూలంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం చేసిన ఏర్పాట్లు, ప్రాంగణ పరిస్థితులు, ఇతర అంశాలపై వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదిక అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో అధికారికంగా ఖరారు చేస్తుందని, తేదీ నిర్ణయమైన వెంటనే ప్రజలకు అధికారిక సమాచారం అందజేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అప్పటివరకు అన్ని శాఖలు పూర్తి సన్నద్ధతతో ఉండి అవసరమైన ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని మిగిలిన పనులు సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, రెవెన్యూ, పోలీసు, విద్యుత్, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కన్న కొడుకును కడతేర్చిన కసాయి తండ్రి అరెస్ట్

**ఖమ్మం బ్యూరో, జులై 6(తెలంగాణ ముచ్చట్లు ):** చెడు వ్యసనాలకు బానిసయి, వివిధ నేరాలకు పాల్పడుతూ.. పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చిన కొత్తపల్లి సీతారాములు @ జాన్ మార్క్ తండ్రి రాములు @రాయప్ప నివాసం అంబేద్కర్ నగర్ కాలనీ కల్లూరు అనే వ్యక్తి ప్రస్తుతం తన వద్ద చెడు వ్యసనాలకు సరిపడ డబ్బులు లేకపోవడంతో అతను కుటుంబంతో సహా ఉంటున్న ఇల్లు అమ్మకానికి బేరాలు తీసుకొస్తుండగా అతని భార్య, కుమారుడు కిరణ్ కుమార్ ఒప్పుకోకపోవడంతో, పలుమార్లు కుమారుడిని ఇల్లు ఖాళీ చేయమని చెప్పినా వినకపోవడంతో, కుమారుడిని చంపితేనే అతడికి ఇల్లు అమ్ముకోవడం వీలు పడుతుందని భావించి, ముందస్తు ప్లాన్ ప్రకారం సదరు నిందితుడు సీతారాములు జులై 3న సాయంత్రం తన కుమారుడిని కల్లూరు లో ఉన్న ఒక బెల్ట్ షాప్ కి తీసుకువెళ్లి మద్యం



తాపించి మరలా ఇంటికి తీసుకొని వెళ్లి అతను మద్యం మత్తులో గాడ నిద్రలో మంచంపై పడుకొని ఉండగా, సీతారాములు ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం కిరణ్ కుమార్ తలపై రోకలి బండతో గట్టిగా మోది, గాయపరచగా సదరు కిరణ్ కుమార్ రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుచుండగా, అతడు చనిపోయాడని భావించి సీతారాములు తన యొక్క ఆటోలో అక్కడి నుంచి పరారై, గత రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్లోని తిరువూరు, విస్సన్నపేట ప్రాంతాలలో తిరుగుతూ... సోమవారం కల్లూరు వైపునకు ఆటోలో వస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు అతని కోసం వెతుకుతున్న పోలీస్ బృందం సోమవారం ఉదయం సమయంలో ముగ్గు వెంకటాపురం గ్రామము వద్ద అతనిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి ఆటో, నేరానికి ఉపయోగించిన రోకలి బండ, కత్తిని మధ్యవర్తుల సమక్షంలో సీజ్ చేసి ముద్దాయిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. తదుపరి ముద్దాయిని రిమాండ్ నిమిత్తం ఏ జై ఫ్ సి ఎం సత్తుపల్లి వారి వద్ద హాజరు పరుచబడుతుంది అని సత్తుపల్లి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ముత్తులింగం ఒక ప్రకటనలో తెలియజేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: పొట్లపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## రాష్ట్ర డీజీపీ సీవీ. ఆనంద్ కి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, జులై 6(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా నగరంలోని ఎన్ఎస్పీ అధికారుల అతిధి గృహానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ.ఆనంద్ ని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ... పోలీస్ కమిషనర్ సునీల్ దత్...







## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

- **జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం బ్యూరో, జూలై -06(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిశీలించి, పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు సమర్పించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, అర్హత ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఖమ్మం అర్బన్ మండలం 15వ డివిజన్‌కు చెందిన సయ్యద్ రహమత్ బీ తాను అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నానని, సొంత ఇంటి స్థలం కూడా లేదని, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా, ఖమ్మం మున్సిపల్ కమీషనర్ కు పంపిస్తూ, నిబంధనల మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

తిరుమలాయపాలెం మండలానికి చెందిన భానురేఖ టేకులపల్లి మహిళా ప్రాంగణంలో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేసినప్పటికీ, ఏఎన్ఎం సర్టిఫికెట్ రిజిస్ట్రేషన్ విషయంలో అధికారులు స్పందించడం లేదని దరఖాస్తు సమర్పించగా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి విచారించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేలకొండపల్లి మండలం రెవెన్యూ గ్రామానికి చెందిన లక్కం వెంకన్న, బక్కయ్య, శ్రీనివాస్ లు సర్వే నంబర్లు 993లో 23 గుంటలు, 616లో 15 గుంటలు, 1004లో 12 గుంటలు, 1005లో 12 గుంటల భూమి ఉందని, సాధా బైనామా కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పాస్ పుస్తకాలు అందలేదని తెలపగా, సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ విచారించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామానికి చెందిన వంగర రమాదేవి తన కుమార్తెకు కళ్యాణలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మంజూరు కాలేదని తెలపగా సంబంధిత తహసీల్దార్‌కు పంపిస్తూ అర్హత మేరకు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలపై కలెక్టర్ల ప్రత్యేక దృష్టి



- **రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల తనిఖీలు**
- **విద్యార్థులతో కలిసి పాఠాలు**
- **విద్యా ప్రమాణాలపై సమీక్ష**

**హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చే దిశగా రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పలువురు కలెక్టర్లు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మమేకమవుతూ బోధనా విధానాన్ని పరిశీలించారు. పాఠశాలలను సందర్శించిన కలెక్టర్లు తరగతి గదుల్లో విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించి, వారి అభ్యాస సామర్థ్యాన్ని అంచనా వేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు, అవసరాలు తెలుసుకుని మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు చర్యలు సూచించారు. అలాగే తరగతి గదులు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదవాలని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్లు ప్రోత్సహించారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని వారికి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ విద్యా ప్రమాణాలను మరింత బలోపేతం చేసే చర్యలు కొనసాగనున్నాయని అధికారులు వెల్లడించారు.






## ధూప దీప నైవేద్య అర్చక సంఘం సొమ్ము గోల్మాల్

**ఖమ్మం బ్యూరో, జులై 6(తెలంగాణ ముచ్చట్లు ):** ధూప దీప నైవేద్య అర్చక సంఘం అధ్యక్షుడిగా , కోశాధికారిగా చలామణి అవుతున్న దౌలతాబాద్ వాసుదేవ శర్మ ,నందనం హరికిషన్ శర్మలు రూప దీప నైవేద్య అర్చక సంఘం ద్వారా సేకరించిన సొమ్మును సంఘం ఆమోదం లేకుండా సంఘాన్ని ఏటీఎం గా వాడుకుని హిస్టారైన ఖర్చు చేసినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న అన్నావద్దల ప్రసాద్ శర్మ ఆరోపించారు.

పంచకుండాత్మక చండీ సహిత రుద్ర పాశుపత హోమం పేరుతో వివిధ జిల్లాల కార్యవర్గాల ద్వారా సుమారు పది లక్షల రూపాయలు మరియు దేవాదాయ ధర్మాదాయ శాఖ ద్వారా రెండు లక్షల రూపాయలు సేకరించి అట్టి సొమ్మును సంఘ నిబంధనలకు విరుద్ధంగా వాడుకున్నారని ఆరోపించారు. ఆ ఇద్దరూ జాయింట్



అకౌంట్ ద్వారా ధూపదీప నైవేద్య అర్చక సంఘం అకౌంట్ నుంచి డబ్బులు తీసి వాడుకున్నారని, ఈ విషయంలో వారిని నిలదీయగా కోశాధికారి గా ఉన్న నందనం హరికిషన్ శర్మ నాకు ఈ సంఘానికి సంబంధం లేదని నా ద్వారా ఆయన ఖర్చులు చూపెడుతున్నానని నేటినుండి ధూపదీప నైవేద్య సంఘానికి నాకు సంబంధం లేదని వైదొలికినారు

వాసుదేవ శర్మ ఏకపక్ష నిర్ణయంతో ధూప దీప నైవేద్య సంఘం కార్యవర్గాన్ని రద్దు చేస్తున్నానని తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ విషయమై తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ధూపదీప నైవేద్య జిల్లా అర్చక సంఘాలు వాసుదేవ శర్మను ఎక్కడికక్కడ నిలదీయాలని కోరారు.

సంఘానికి కొన్ని నియమ నిబంధనలు ఉన్నాయని ఖర్చులు చేసే విధానంలో సంఘం సభ్యులందరికీ సమక్షంలో తీర్మానాలు చేసిందని అట్టి తీర్మాలను అన్నిటిని తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా సొమ్మును వాడుకున్నారని ఆరోపించారు. చైతన్య సదస్సుల పేరుతో తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాలలో తిరిగి గ్రూపు రాజకీయాలు ప్రేరేపించాడని, చైతన్య సదస్సుల పేరుతో అర్చకులు అందరినీ సమావేశం పరచడానికి ఒక్కొక్క జిల్లాకు సుమారు లక్ష రూపాయలు ఖర్చు వచ్చిందని దాని ద్వారా సాధించింది ఏమి ఉందని ప్రశ్నించారు. ఇప్పటికైనా వాసుదేవ శర్మ బేషరతుగా రాష్ట్ర కార్యవర్గంలో ఉన్న సుమారు 85 మంది సభ్యులకు క్షమాపణ చెప్పి సంఘంలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహించాలని ప్రధాన కార్యదర్శి అన్నావుజల ప్రసాద్ శర్మ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ మరియు దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయార్ ని, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ని , అదనపు సహాయ కమిషనర్ కూరాకుల జ్యోతి గారిని ఇతర మంత్రివర్యులను కలిసి దీనిపై వినతి పత్రం ఇస్తామని తెలియజేశారు





## కాళేశ్వరంపై కేసీఆర్ సమాధానం చెప్పాలి: పొంగులేటి

- **ప్రత్యేక అసెంబ్లీకి సిద్ధం**
- **కాళేశ్వరంపై బహిరంగ చర్చకు సవాల్**
- **ఇందిరమ్మ ఇళ్లపై విమర్శలకు కౌంటర్**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**సిద్దిపేట, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ తేదీ, సమయం చెబితే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

సోమవారం సిద్దిపేట జిల్లా ములుగు మండలంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. దేశంలోనే "ఎనిమిదో వింత"గా కాళేశ్వరం ప్రాజెక్టును ప్రచారం చేసిన కేసీఆర్, ఇప్పుడు ప్రాజెక్టు ఎందుకు కుంగిపోయిందో, వేల కోట్ల ప్రజాధనం ఎలా వృథా అయిందో ప్రజలకు వివరించాలని మంత్రి అన్నారు. కాళేశ్వరం నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ప్రాజెక్టు దెబ్బతినడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధం లేదని పేర్కొన్నారు.

ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసే బదులు అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం, ఇందిరమ్మ ఇళ్ల అంశాలపై బహిరంగంగా చర్చించాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ప్రజాహితం కోసం సూచనలు ఉంటే శాసనసభ వేదికగా చెప్పాలని అన్నారు.

రాష్ట్రంలో ఇప్పటికీ పూరిగుడిసెల్లో నివసిస్తున్న వేలాది కుటుంబాలను గుర్తించి వారికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం కొద్ది ప్రాంతాలకే పరిమితమై మిగిలిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేసిందని, అనేక ఇళ్లను అసంపూర్తిగా వదిలేసిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేస్తున్నామని, మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు అందజేస్తూ సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. తొలి విడతలో లక్షలాది ఇళ్ల నిర్మాణం పురోగతిలో ఉండగా, రెండో విడతలో రెండున్నర లక్షల ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

# గవర్నర్‌ను కలిసిన టెలిమెడిసిన్ ప్రతినిధులు

- లోక్‌భవన్‌లో మర్యాదపూర్వక భేటీ
- టెలిమెడిసిన్ సేవలపై చర్చ
- గవర్నర్‌కు వినతులు

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):



టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రామచంద్ర విష్ణుభట్లతో పాటు పలువురు ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో టెలిమెడిసిన్ సేవల విస్తరణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. భేటీ సందర్భంగా టెలిమెడిసిన్ సేవల ప్రాధాన్యం, సాంకేతికత ఆధారిత వైద్య సేవల విస్తరణ, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించే అవకాశాలపై ప్రతినిధులు గవర్నర్‌కు వివరించారు. ఆరోగ్య రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. టెలిమెడిసిన్ సేవల ద్వారా గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు నిపుణులైన వైద్యుల సేవలను చేరువ చేయవచ్చని ప్రతినిధులు తెలిపారు. డిజిటల్ సాంకేతికతతో వైద్య సేవలను మరింత విస్తరించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రతినిధుల సూచనలు, అభిప్రాయాలను గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆసక్తిగా విన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేందుకు సాంకేతికత వినియోగం ఎంతో కీలకమని ఈ సందర్భంగా అభిప్రాయపడినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. భేటీలో రాష్ట్రంలో టెలిమెడిసిన్ సేవల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రజారోగ్య రంగంలో కొత్త అవకాశాలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర శాఖకు చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం గవర్నర్‌తో కలిసి జ్ఞాపికలు మార్చుకుని మర్యాదపూర్వకంగా సమావేశాన్ని ముగించారు.

# బీసీ రిజర్వేషన్ల కోసం మహాసభ

- ఆగస్టు 6న హైదరాబాద్‌లో బహిరంగ సభ
- 50 శాతం రిజర్వేషన్లే లక్ష్యం
- సామాజిక న్యాయ ఉద్యమానికి పిలుపు

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):




బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఆగస్టు 6న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా "సామాజిక న్యాయ తెలంగాణ సాధన సభ" పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, ప్రొఫెసర్ జయశంకర్ సూచించిన సామాజిక న్యాయ తెలంగాణ లక్ష్య సాధన దిశగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. బీసీలతో పాటు సమాజంలోని అన్ని వర్గాలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని పేర్కొన్నారు.
జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన గత రెండేళ్లుగా ప్రజాక్షేత్రంలో ఉద్యమం చేస్తున్నాయని గుర్తు చేశారు. ఈ ఉద్యమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు ఆగస్టు 6 సభ వేదిక కానుందని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించే ఈ సభ దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తుందని కవిత అభిప్రాయపడ్డారు. తమిళనాడులో ప్రారంభమైన మధ్యాహ్న భోజన పథకం దేశవ్యాప్తంగా అమలైనట్లే, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల ఉద్యమం కూడా దేశవ్యాప్తంగా విస్తరిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.
రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, శాసనమండలిలో బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 42 శాతం, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఆమోదించి కేంద్రానికి పంపినప్పటికీ, వాటి ఆమోదం కోసం తగిన స్థాయిలో ప్రయత్నాలు జరగడం లేదని ఆమె విమర్శించారు. "మనమెంతో... మనకంత" అనే నినాదం సాకారం కావాలంటే అన్ని వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని కవిత పిలుపునిచ్చారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ప్రజలంతా ఆగస్టు 6న జరిగే బహిరంగ సభకు భారీగా హాజరై ఉద్యమానికి మద్దతు తెలపాలని ఆమె కోరారు.

# అసెంబ్లీలో నూతన కార్యాలయాల ప్రారంభం

- స్పీకర్ చేతుల మీదుగా ప్రారంభం
- విప్‌లకు శుభాకాంక్షలు
- మీడియా కమిటీ కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ శాసనసభలో నూతనంగా ఏర్పాటు చేసిన పలు కార్యాలయాలను రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ విప్‌లు, శాసనమండలి విప్‌ల కార్యాలయాలతో పాటు అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. శాసనసభ విప్ వేముల వీరేశం కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం శాసనమండలి విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ నూతన కార్యాలయాలను కూడా ప్రారంభించి వారికి అభినందనలు తెలిపారు. అదే సందర్భంగా అసెంబ్లీ మీడియా అడ్వైజరీ కమిటీ నూతన కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. శాసనసభ కార్యకలాపాల సమాచారాన్ని ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో మీడియా విభాగం కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.
శాసనసభలో ప్రజాప్రతినిధులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తోందని అధికారులు తెలిపారు. ప్రజా ప్రతినిధులు తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నూతన కార్యాలయాల ప్రారంభం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శాసనసభలో ప్రజా సమస్యల పరిష్కారం, పరిపాలనా సమన్వయం మరింత మెరుగుపడేందుకు ఈ వసతులు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో శాసనసభ, శాసనమండలి సభ్యులు, అసెంబ్లీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నూతన కార్యాలయాల ప్రారంభంతో శాసనసభ పరిపాలనా కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పులిచింతలలో కార్మికుల ఆందోళన

- ఆత్మహత్యాయత్నంతో ఉద్రిక్తత
- ఉద్యోగాల కోసం ధర్నా
- తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

సూర్యాపేట, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):



సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం వద్ద సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని నిరసిస్తూ ఆర్టిజెన్ కార్మికులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కొందరు కార్మికులు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న కార్మికులు మాట్లాడుతూ తమను శాశ్వత ఉద్యోగులుగా చేస్తామని హామీ ఇచ్చి ఎన్నో సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేయించుకున్నారని ఆరోపించారు. కఠిన పరిస్థితుల్లో విధులు నిర్వహించినప్పటికీ ఇప్పుడు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.
ఉద్యోగాలు కోల్పోవడంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని కార్మికులు తెలిపారు. అకస్మాత్తుగా విధుల నుంచి తొలగిస్తే తాము ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నిస్తూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళన సమయంలో కొందరు కార్మికులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించగా, అక్కడే ఉన్న సహచరులు, అధికారులు అప్రమత్తమై వారిని అడ్డుకున్నారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఘటనతో విద్యుత్ కేంద్రం పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. శాశ్వత నియామకాలపై గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం, సంబంధిత సంస్థలు అమలు చేయాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.
ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కార్మికులతో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితి అదుపులోనే ఉందని, కార్మికుల డిమాండ్లపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

# రూ.70 వేల లంచంతో పట్టుబడ్డ తహసీల్దార్

- చేర్యాలలో ఏసీబీ దాడి
- లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్
- భూ మార్పిడి కోసం డిమాండ్

సిద్దిపేట, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):



సిద్దిపేట జిల్లా చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చే ప్రక్రియలో ఓ రైతు నుంచి రూ.70 వేల లంచం డిమాండ్ చేసిన ఆయన, ఆ మొత్తాన్ని స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడైన రైతు నుంచి భూ వినియోగ మార్పిడి ప్రక్రియకు అనుమతులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారి సూచనల మేరకు పథకం ప్రకారం ఉచ్చుపన్ని దాడి నిర్వహించారు.
ముందస్తు ప్రణాళిక ప్రకారం రైతు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు అక్కడే దాడి చేసి తహసీల్దార్‌ను పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం అవసరమైన పరీక్షలు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో చేర్యాల తహసీల్దార్ కార్యాలయంలో కలకలం రేగింది. అధికారుల సమక్షంలో కార్యాలయానికి సంబంధించిన పలు పత్రాలను ఏసీబీ బృందం పరిశీలించింది. కేసుకు సంబంధించిన ఇతర ఆధారాలను కూడా సేకరించినట్లు సమాచారం. తహసీల్దార్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. లంచం తీసుకునే అధికారులపై కఠిన చర్యలు తప్పవని, ప్రజలు ఇలాంటి ఘటనలు ఎదురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

# అటవీ శాఖకు కొత్త దిశ

- మంత్రిని కలిసిన ముఖ్య కార్యదర్శి
- పర్యావరణ పరిరక్షణపై చర్చ
- ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచన

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):



రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖల నూతన ప్రధాన కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శైలజా రామయ్యర్ సోమవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేస్తూ, శాఖలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అటవీ, పర్యావరణ శాఖలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల అభివృద్ధి, జీవవైవిధ్య సంరక్షణ వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన కార్యదర్శికి దిశానిర్దేశం చేశారు.
రాష్ట్రంలో వనమహోత్సవం, వన్యప్రాణుల సంరక్షణ, అడవుల్లో అగ్నిప్రమాదాల నివారణ, జీవవైవిధ్య పరిరక్షణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అడవుల సంరక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. అటవీ, పర్యావరణ శాఖల బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సమయానికి పూర్తి చేయడంతో పాటు ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.
ఈ భేటీలో అటవీ, పర్యావరణ శాఖల ఆధ్వర్యంలో ప్రస్తుతం అమలవుతున్న పలు కార్యక్రమాలపై మంత్రి కొండా సురేఖ, ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్ సంక్షిప్తంగా చర్చించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు. శాఖల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపే దిశగా కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను సాధించేందుకు అటవీ శాఖ అధికారులు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# ప్రగతి ప్రాజెక్టులపై సీఎస్ సమీక్ష

- అమలులో వేగం పెంచాలని ఆదేశం
- కీలక ప్రాజెక్టుల పురోగతిపై చర్చ
- అధికారులకు దిశానిర్దేశం

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు సోమవారం సచివాలయంలో ప్రగతి (పీఎంజీ) ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అమలవుతున్న కీలక ప్రాజెక్టుల పురోగతిని పరిశీలిస్తూ వాటి అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన ప్రధాన ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులు వివరించారు. ప్రాజెక్టులు నిర్ణీత గడువులో పూర్తయ్యేలా కార్యాచరణ చేపట్టాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం మరింత పెంచాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు త్వరగా ప్రయోజనాలు అందేలా పనుల్లో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అమలులో ఎదురయ్యే అడ్డంకులను వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.
ప్రగతి ప్రాజెక్టుల విజయవంతమైన అమలు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ప్రాజెక్టుల పురోగతిపై వివరాలు అందించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో తనిఖీలు

- హైడ్రా బృందం పరిశీలన
- అనుమతులపై విచారణ
- తదుపరి చర్యలకు సన్నాహం

హైదరాబాద్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):



హుస్సేన్‌సాగర్ పూర్తి ట్యాంకు మట్టం (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా, జీహెచ్ఎంసీ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా సోమవారం క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ డా. ప్రియాంక అలా నేతృత్వంలో అధికారుల బృందం నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించింది. ఇరిగేషన్ శాఖ నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టారు. హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టేందుకు తమ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని ఇరిగేషన్ అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేసినట్లు తెలిపారు.

ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ చేపడుతున్న భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలు, సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించారు. నిర్మాణ పనులు ఎలాంటి అనుమతుల ఆధారంగా కొనసాగుతున్నాయనే అంశంపై అన్ని కోణాల్లో వివరాలు సేకరించారు. అధికారుల బృందం నిర్మాణ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, సంబంధిత శాఖల నుంచి పూర్తి సమాచారం కోరింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలకు సంబంధించి అమల్లో ఉన్న నిబంధనలు ఉల్లంఘించబడ్డాయా లేదా అనే అంశంపై సమగ్ర విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించింది.

పూర్తిస్థాయి విచారణ అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు కూడా చేపడతామని స్పష్టం చేశారు. జలవనరులు, చెరువుల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజా ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ చట్టం ప్రకారం వ్యవహరిస్తామని తెలిపారు.

# క్యాన్సర్ ఔషధ తయారీ కేంద్రం ప్రారంభం

- సిరో ఫార్మా యూనిట్ ప్రారంభం
- ఫార్మా రంగానికి ప్రోత్సాహం
- చౌకగా మందులు అందించాలి

సిద్దిపేట, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):



సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలంలోని బయోటెక్ పార్క్ ఫేజ్ 3లో సిరో ఫార్మా ఆధ్వర్యంలో నిర్మించిన అత్యాధునిక ఆంకాలజీ (క్యాన్సర్) ఔషధాల తయారీ కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫార్మా రంగంలో తెలంగాణ మరింత ముందంజలో నిలుస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫార్మా రంగంలో హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. ఆ గుర్తింపును మరింత బలోపేతం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని తెలిపారు.

తెలంగాణలోనే క్యాన్సర్ వ్యాధిపై పరిశోధనలు చేపట్టి ఔషధాల తయారీ ప్రారంభించడం గర్వకారణమని మంత్రి అన్నారు. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించే ప్రత్యేక ఫార్మా పరిశోధనలకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలకు తెలంగాణ కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాధి తీవ్రమైన సవాల్‌గా మారిందని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల తేడా లేకుండా అనేక మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారని, ఖరీదైన మందులు కొనుగోలు చేయలేక బాధపడుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో క్యాన్సర్ నివారణకు కొత్త ఔషధాల అభివృద్ధి ఎంతో అవసరమన్నారు.

సిరో ఫార్మా సంస్థ తయారు చేసే క్యాన్సర్ నిరోధక ఔషధాలను ప్రజలకు అందుబాటు ధరల్లో అందించాలని యాజమాన్యాన్ని మంత్రి కోరారు. నాణ్యమైన వైద్య సేవలు అందరికీ చేరువ కావాలంటే చౌక ధరల్లో మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని అన్నారు. భవిష్యత్తులో ఫార్మా రంగంలో సిరో ఫార్మా మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. సంస్థ యాజమాన్యానికి, శాస్త్రవేత్తలకు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణను ప్రపంచ స్థాయి జీవ విజ్ఞాన, ఔషధ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పునరుద్ఘాటించారు.



# రష్యా వీసా పేరుతో భారీ మోసం

- రూ.9.37 లక్షల టోకరా
- ప్రధాన నిందితుడి అరెస్ట్
- విదేశీ ఉద్యోగాలపై అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):

రష్యా వర్క్ పర్మిట్ వీసాలు ఇప్పిస్తామని నమ్మించి రూ.9.37 లక్షలు కాజేసిన మోసగాళ్ల ముఠా గుట్టును మాచారెడ్డి పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి వద్ద నుంచి రూ.45 వేల నగదు, మూడు పాస్‌పోర్టులు, ఒక మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పలువురిని నమ్మించి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసిన నిందితులు, అనంతరం బాధితులకు వీసాలు, ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారంతో ప్రధాన నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.45 వేల నగదు, మూడు పాస్‌పోర్టులు, ఒక మొబైల్ ఫోన్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసుకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించారు. ఈ మోసంలో మరికొందరి ప్రమేయం ఉన్న కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాధితుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా నిందితుల నెట్‌వర్క్‌ను గుర్తించే పనిలో ఉన్నట్లు వెల్లడించారు. విదేశీ ఉద్యోగాల పేరుతో ప్రజలను మోసం చేసే ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రభుత్వ అనుమతులు పొందిన సంస్థల ద్వారానే విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని, ఎలాంటి ధృవీకరణ లేకుండా డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు. ఇలాంటి మోసాలకు గురైన వారు లేదా అనుమానాస్పద వ్యక్తుల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.





# టికెట్‌లో చిన్న తప్పిదం.. రూ.7,035 జరిమానా

- వయసు 24కు బదులు 1 సంవత్సరం నమోదు
- ఐడీ చూపించినా టీటీఈ నుంచి ఉపశమనం లేదు
- బుకింగ్ వ్యవస్థలో లోపంపై రైల్వే దర్యాప్తు

నాగ్‌పూర్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):

రైల్వే టికెట్‌లో నమోదైన చిన్న పొరపాటు ఓ ప్రయాణికుడికి భారీ జరిమానాను తెచ్చిపెట్టింది. బెంగుళూరు నుంచి నాగ్‌పూర్ వరకు రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన 24 ఏళ్ల యువకుడి టికెట్‌లో వయసు 24కు బదులుగా ఒక సంవత్సరం మాత్రమే నమోదవడంతో టీటీఈ రూ.7,035 జరిమానా విధించాడు. ఈ ఘటన జూన్ 23న 22691 నంబర్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో చోటుచేసుకుంది. ప్రయాణికుడు రమాకాంత్ తన టికెట్‌లో వయసు నమోదు సమయంలో డేటా ఎంట్రీలో పొరపాటు జరిగిందని, అందుకే ఒక సంవత్సరం అని ముద్రించబడిందని టీటీఈకి వివరించాడు. తన అసలు గుర్తింపు కార్డును కూడా చూపించినప్పటికీ, టికెట్‌లోని వివరాలు సరిపోలడం లేదనే కారణంతో టీటీఈ జరిమానా విధించారు.

జరిమానా మొత్తాన్ని రమాకాంత్ యూపీఐ ద్వారా చెల్లించాడు. అనంతరం నాగ్‌పూర్‌లో రైలు దిగిన తర్వాత 'రైల్ మదద్' వేదిక ద్వారా ఫిర్యాదు చేశాడు. అయితే రైల్వే అధికారులు కేసును పరిశీలించి, టీటీఈ విధించిన జరిమానా నిబంధనల ప్రకారమేనని స్పష్టం చేస్తూ ఫిర్యాదును తిరస్కరించారు. ప్రయాణానికి ముందు టికెట్‌లోని వ్యక్తిగత వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు. ఏవైనా తప్పులు ఉంటే ముందుగానే సరిచేసుకోవాల్సి ఉండగా, అలా చేయకపోవడంతో సరైన టికెట్ లేనట్టేనని భావించి 1989 రైల్వే చట్టంలోని సెక్షన్-138 ప్రకారం జరిమానా విధించినట్లు వెల్లడించారు.

అయితే టికెట్‌లో వయసు కేవలం ఒక సంవత్సరం మాత్రమే నమోదైనా రిజర్వేషన్ వ్యవస్థ దానిని ఎలా ఆమోదించిందనే అంశంపై దక్షిణ పశ్చిమ రైల్వే అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. బుకింగ్ వ్యవస్థలో ఏవైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

# అమర్‌నాథ్ యాత్రకు కట్టుదిట్ట భద్రత

- సంయుక్తంగా భద్రతా ఏర్పాట్లు
- యాత్రికులకు నిరంతర సేవలు
- అప్రమత్తంగా భద్రతా బలగాలు

శ్రీనగర్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):






అమర్‌నాథ్ యాత్ర-2026ను సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ), జమ్మూ కశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు సంయుక్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాయి. యాత్రికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ అన్ని మార్గాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తున్నాయి. యాత్రా మార్గాల్లో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రతి యాత్రికుడికి అవసరమైన సహాయాన్ని అందిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు.

యాత్రికులకు మార్గదర్శనం చేయడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా భద్రతా బలగాలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. యాత్ర నిరంతరాయంగా కొనసాగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. సేవ, భద్రత, సౌభ్రాతృత్వం లక్ష్యంగా ఎస్ఎస్‌బీ సిబ్బంది యాత్రికులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ మానవతా దృక్పథంతో విధులు నిర్వర్తిస్తున్నారు. భద్రతతో పాటు యాత్రికుల సౌకర్యాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

యాత్ర మార్గాల్లో నిరంతర గస్తీ, తనిఖీలు, నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాల సమన్వయంతో యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు కొనసాగుతున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తులు ప్రశాంతంగా అమర్‌నాథ్ దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. యాత్ర విజయవంతంగా కొనసాగేందుకు భద్రతా బలగాలు నిరంతరం అప్రమత్తంగా సేవలందిస్తున్నాయి.

# కశ్మీర్‌ను వణికించిన భారీ వర్షాలు


- కొండచరియలు విరిగి భారీ నష్టం
- జలవిద్యుత్ ప్రాజెక్టులో చిక్కుకున్న వాహనాలు
- సహాయక చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్, సైన్యం

శ్రీనగర్, జులై 6 (తెలంగాణ ముచ్చట్లు):

జమ్మూకశ్మీర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు సోమవారం తీవ్ర బీభత్సం సృష్టించాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడగా, కిశ్త్‌వాడ్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న 540 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ప్రాజెక్టు ప్రాంతానికి వెళ్లే రహదారిపై భారీగా బురద, బండరాళ్లు పేరుకుపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొండచరియలు విరిగిపడటంతో ట్రక్కులు, మిల్లులు, ఇతర భారీ యంత్రాలు బురదలో కూరుకుపోయాయి. మరికొన్ని వాహనాలు భారీ రాళ్ల కింద చిక్కుకుపోయాయి. నిర్మాణానికి సంబంధించిన పరికరాలు, సామగ్రి కూడా దెబ్బతిన్నట్లు అధికారులు వెల్లడించారు.

సమాచారం అందుకున్న వెంటనే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత సైన్యం, స్థానిక రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వాహనాలను వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగుతున్నాయి. ఆకస్మిక వరదలతో భారీ మొత్తంలో బురద, బండరాళ్లు ప్రాజెక్టు ప్రాంతంలోకి చేరాయని అధికారులు తెలిపారు. దీంతో నిర్మాణ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, నష్టం అంచనా వేసే పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

ప్రజల భద్రత దృష్ట్యా కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రమాద ప్రభావిత ప్రాంతాలకు ప్రజలు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారులపై కూడా బురద, శిథిలాలు పేరుకుపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ పరిస్థితులు మెరుగుపడే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సూచనలు పాటించాలని యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in